
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 27 ఫిబ్రవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 , కనిష్ఠం 20.0

- భక్తి శ్రద్ధలతో మహా శివరాత్రి
- కమనీయంగా శివపార్వతుల కల్యాణోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

శంభో శివశంభో



పచ్చల సోమేశ్వరుడు, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

శివనామ స్మరణతో జిల్లా మార్మోగింది. మహా శివరాత్రి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలతో అంతటా అధ్యాత్మికత వెల్లివిరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలిరావడంతో కిక్కిరిశాయి. నల్లగొండ పట్టణంలోని ఛాయా సోమేశ్వరాలయం, పచ్చలకట్ట సోమేశ్వరాలయం, వాడపల్లి శివాలయాలు, ఏలేశ్వరంకొండ శివాలయాల్లో శివరాత్రి ప్రత్యేక పూజలు కొనసాగాయి. లింగోద్భవ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి వేళ ఆలయాల్లో శివకల్యాణాన్ని తిలకించారు. భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించి జాగరణ చేశారు. ఛాయా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. పూజల అనంతరం ఆమెకు అర్చకులు ఆశీర్వచనం అందజేశారు.



ఛాయా సోమేశ్వరాలయంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఆర్టీసీ.. ఆధునికం

టిమ్ వినియోగంలో కొత్త పద్ధతి



ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంలో ఆర్టీసీ ముందడుగు వేస్తోంది. టిమ్ (టికెట్ ఇష్యూయింగ్ మిషన్) వినియోగంలో కొత్త పద్ధతిని అనుసరించనుంది. చిల్లర సమస్యకు చెక్ పెట్టడంతో పాటు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. అంతేగాక ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించేందుకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే టీఎస్ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రయోగాత్మకంగా ప్రారంభించి విజయవంతంగా పర్యావరణహిత ఇంధనంతో నడిచే ఆధునిక బస్సుల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనుంది. ఉమ్మడి జిల్లాకు 132ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. బస్సులు విద్యుత్ సామర్థ్యంతోనే నడవనుండగా ఆ యాడిపోల్లో గతేడాది చివర చార్జింగ్ పాయింట్ల పనులు ఆరంభించారు. అయితే పనులు పూర్తయ్యేందుకు ఐదు నుంచి ఏడు నెలల సమయం పట్టనున్నట్లు సమాచారం.

- (ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)

నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాని కి గురువారం నిర్వహించే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉపాధ్యాయ వర్గాలు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకం గా తీసుకోవడం, బలమైన అభ్యర్థులు బరిలో ఉండడంతో పోలింగ్‌పై అందరి దృష్టి నెలకొంది. బుధవారం నియోజకవర్గ పరిధిలోని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రి, సిబ్బంది, భద్రతా సిబ్బందిని ప్రత్యేక బస్సుల ద్వారా పోలింగ్ స్టేషన్లకు తరలించారు. బుధవారం సాయంత్రానికే అందరూ వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు.నియోజకవర్గంలో మొత్తం 25,797 మంది ఓటర్లు ఉండగా 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో 8,331 మంది ఓటర్లకు 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్

టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ నేడే

- పోలింగ్ కేంద్రాలకు చేరిన బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది
- 8,331 మంది ఓటర్లు
- బరిలో 19 మంది అభ్యర్థులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 77 పోలింగ్ స్టేషన్లు

జిల్లా	రూట్లు	పోలింగ్ కేంద్రాలు	పోలింగ్ సిబ్బంది	పోలీస్ సిబ్బంది	ఓటర్లు
నల్లగొండ	13	37	250	518	4,683
సూర్యాపేట	7	23	139	300	2,664
యాదాద్రి	5	17	104	165	984
మొత్తం	25	77	443	983	8,331

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 77 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, మొత్తం 8,331 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నల్లగొండ జిల్లాలో 13 రూట్లు, సూర్యాపేట జిల్లాలో 8 రూట్లు, యాదాద్రి జిల్లాలో ఐదు రూట్లు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, మరో అదనపు పోలింగ్ అధికారి, మరో సహాయ పోలింగ్ అధికారి, ఒక మైక్రోఅబ్జర్వర్, మరో సెక్టోరియల్ అధికారి ఎన్నిక విధుల్లో పాల్గొనున్నారు. నల్లగొండ జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలకు, 250 మంది సిబ్బంది, సూర్యాపేట జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలకు 139 మంది, యాదాద్రి జిల్లాలో 17 పోలింగ్ స్టేషన్లకు 104 మంది మొత్తం 443 మంది సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 518 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. నలుగురు డీఎస్పీలు, 18మంది సీఐలు, 43 మంది ఎస్ఐలు, 101 మంది ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, 278 మంది కానిస్టేబుళ్లు, మరో 74 మంది హోంగార్డులు ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తారు.

అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న 19 మంది అభ్యర్థులు

శాసనమండలి పునరుద్ధరణ తర్వాత 2007లో తొలిసారి ఎన్నికలు జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గంలో తొలిసారి స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త చుక్కా రామయ్య గెలుపొందారు. 2013లో జరిగిన ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘం బలపరచిన పూల రవీందర్ గెలుపొందగా, 2019లో యూటీఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అందులో సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి యూటీఎఫ్ మద్దతుతో బరిలో నిలిచారు. పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో ...

- మిగతా 6వ పేజీలో...

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో గురువారం నిర్వహించే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం. మిగిలిన 11 జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటున్నాం. బుధవారం సాయంత్రానికే అన్ని పోలింగ్ స్టేషన్లకు సిబ్బంది, భద్రతా బలగాలు పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. పోలింగ్ పూర్తయ్యాక తిరిగి గురువారం సాయంత్రమే అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి నల్లగొండలోని స్టేట్‌వేర్‌హౌస్ గోదాముల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు పోలింగ్ బాక్సులు తరలించేలా ఏర్పాట్లు చేశాం. ప్రతీ పోలింగ్‌స్టేషన్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సెక్టోరియల్ అధికారిని నియమించాం. ఎన్నికకు సంబంధించి ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులంతా వారి ఓటుహక్కును వినియోగించుకోవాలి. ఎన్నిక ప్రశాంతంగా ముగిసేందుకు అందరూ సహకరించాలి.

- ఇలా త్రిపాఠి, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్

50శాతం రాయితీతో స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణ

సెట్విన్ కోఆర్డినేటర్ సరిత

నల్లగొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని సెట్విన్ సాంకేతిక శిక్షణా సంస్థలో విద్యార్థులకు 50శాతం ఫీజు రాయితీతో పలు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సెట్విన్ కోఆర్డినేటర్ ఎం.సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు పూర్తయ్యాక జాబ్‌మేళా కూడా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మొత్తం ఐదు విభాగాల్లో 26 రకాల కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఐదు రకాల కంప్యూటర్ కోర్సులు, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఐదు కోర్సులు, బ్యూటీషియన్‌లో ఐదు రకాల కోర్సులు, ఎడ్యుకేషన్‌లో రెండు కోర్సులు, తొమ్మిది రకాల సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన, ఉపాధి అందించే కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు నల్లగొండలోని సెట్విన్ శిక్షణా కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి •6లో..

నీటితొట్ల నిర్వహణపై పట్టింపేదీ? •7లో..

బలంగా బహుజనవాదం : ఇంటలెక్చువల్ ఫోరమ్

పూల రవీందర్‌కు బహుజనుల మద్దతు అని విశ్వాసం



సూర్యాపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

నల్లగొండ, ఫిబ్రవరి 26: ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మునుపెన్నడూ లేని విధంగా బహుజనవాదం గెలుస్తుందని బహుజన మేధావులు విశ్వసిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో గతానికి భిన్నంగా ప్రచారంలో ఈ వాదం పనిచేసిందని అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు తదితరులు ఈ ఎన్నికల్లో బీసీ, బహుజన వాదాన్ని బలంగా ప్రచారం చేయడంతో ఈ సానుకూలత వచ్చిందని భావిస్తున్నారు. బీసీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపు ద్వారా రాష్ట్ర రాజకీయాలు మలుపు తిరుగుతాయని, ఇది బీసీ రాజ్యాధికార వాదానికి దోహదపడుతుందని చెబుతున్నారు. 35 పైగా ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్య సంఘాల మద్దతుతో బహుజన అభ్యర్థిగా రంగంలో ఉన్న పూల రవీందర్ గెలుపునకు ఈ నినాదం దోహదపడుతుందని చెప్పారు.

విద్యారంగంలో రవీందర్ ప్రస్థానం

పూల రవీందర్ సాధారణ ఉపాధ్యాయుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ ఉద్యమంలో టీటీజేఏసీ చైర్మన్‌గా, ఆరేళ్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. ఈ కాలంలో ఉపాధ్యాయుల పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన విషయాన్ని బలంగా తీసుకెళ్లగలిగామని బీసీ నేతలు శీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘంలోని వర్గ విభేదాలతో ఓటమిపాలైనా, గడిచిన ఆరేళ్లు రవీందర్ ఆ సంఘంలోనే ఉంటూ ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వచ్చారన్నారు. 010 ద్వారా ఉపాధ్యాయులకు వేతనాలు, మహిళా ఉపాధ్యాయులను చైల్డ్‌కేర్ సెలవులు, పండిట్, పీఈటీ అప్ గ్రేడేషన్, కేజీబీవీ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం, వివిధ పీఆర్సీ కాలాల్లో మెరుగైన ఫిట్‌మెంట్ సాధన, మోడల్ స్కూల్స్ ఆశ్రమ పాఠశాలల, గురుకులాల సిబ్బందికి ఉపయుక్తమైన ఎన్నో జీవోల వెనక రవీందర్ కృషి ఉందనేది ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్), యూనిఫైడ్ పెన్షన్ సిస్టమ్(యూపీఎస్)ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించడానికి కృషి చేస్తారని, పీఆర్సీలో ఉద్యోగ ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తారన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్స్ ఉపాధ్యాయుల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలను సందర్శించి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థిస్తుంటే బహుజన బిడ్డగా పుట్టినందుకు, పోటీ చేస్తున్నందుకు తాను గర్వపడుతున్నానని పూల రవీందర్ పేర్కొంటున్నారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తనను ఆదరిస్తారని ఆయన ఆశిస్తున్నారు.

లక్షలు పోయాయ్.. అప్పులు మిగిలాయ్

- రిజర్వేషన్లు తేలకముందే గ్రామాల్లో ఆశావహుల ప్రయత్నాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు విచ్చలవిడిగా ఖర్చు
- అప్పులు చేసి ఖర్చు చేసిన వైనం?
- స్థానిక సంస్థల ఎన్నికల ఆలస్యంతో మనోవేదన •6లో..

బోనస్ కోసం ఎదురుచూపు

- జిల్లాలో 74,394 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు
- రూ. 10 కోట్ల మేర బకాయి •8లో..

లక్షలు పోయాయ్..
అప్పులు మిగిలాయ్



- రిజర్వేషన్లు తేలకముందే గ్రామాల్లో ఆశావహుల ప్రయత్నాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు విచ్చలవిడిగా ఖర్చు
- అప్పులు చేసి ఖర్చు చేసిన వైనం?
- స్థానిక ఎన్నికల ఆలస్యంతో మనోవేదన

స్థానిక ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికవ్వాలనుకునే పలువురు ఆశావహులు అప్పుల పాలయ్యారు. ఎన్నో ఆశలతో ఉన్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కొంత సమయం పడుతుందని తెలియడంతో తమ ఆవేదనను సన్నిహితుల వద్ద వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట పండుగలు, పబ్బాలు, అశుభ కార్యాలకు అప్పులు చేసి సహాయాలు చేశారు. తీరా ఎన్నికలకు సమయం పడుతుందని తెలియడంతో అప్పులే మిగిలాయన్న నిరాశలో ఉన్నారు.

చర్చ

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 428 సర్పంచ్‌లు, 178 ఎంపీటీలు 17 జడ్పీటీసీ సభ్యుల స్థానాలు ఉన్నాయి. రెండు నెలల నుంచి ఆశావహులు ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రజలను మచ్చిక చేసుకొని ఓట్లను రాబట్టుకోవడానికి కసరత్తు చేశారు. ప్రధానంగా కొంతమంది ఆయా కులసంఘాలకు చెందిన గ్రామదేవతల ఆలయాల నిర్మాణాలకు, వివాహాలు, దినకర్మలు, విహారయాత్రలు, యువతకు జిమ్, క్రికెట్ కిట్లు, పండుగలకు, పబ్బాలకు విచ్చలవిడిగా మద్యం, విందులు, వినోదాలకు లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఇలా ఓటర్లను తమ వైపు ఆకర్షించుకునేందుకు చేయని ప్రయత్నాలు లేవు. ఇప్పటికే ఆశావహులు లక్షల రూపాయలు అప్పులు చేసి తమ పంతం నెగ్గించుకోవాలనే సంకల్పంతో వ్యూహరచనలో మునిగిపోయారు. ఎలాగైనా లక్షలు ఖర్చు చేసి అయినా ప్రజాప్రతినిధులుగా ఎన్నికవ్వాలనే లక్ష్యంతో కొన్నినెలలుగా ఖర్చు చేశారు. అయితే ప్రభుత్వం ఎన్నికలపై స్పష్టత లేకపోవడంతో తీవ్రఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందన్న ప్రచారంతో ఓటర్లు చెదిరిపోకుండా వారిని ప్రసన్నం చేసుకోవాలనే ఆలోచనలో ముందుగానే ఖర్చు చేశారు.

ఆందోళన కలిగిస్తున్న రిజర్వేషన్ల అంశం

మరోవైపు ఆయా గ్రామాల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్న ఆశావహులకు రిజర్వేషన్ల సమస్య పెద్ద తలనొప్పిగా మారే పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు డబ్బు ఖర్చు పెట్టినప్పటికీ రిజర్వేషన్లు మారితే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయోనని అప్పటి వరకు ఓటర్లకు ఏం చెప్పాలో, డబ్బులు లక్షల కొద్దీ ఖర్చు చేయాల్సి వస్తే తమ పరిస్థితి ఏంటని అయోమయానికి గురవుతున్నారు. చివరకి రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయా? లేదా అనే సంశయంలో పడ్డారు. దీంతో గ్రామాల్లో ఉత్కంఠ వాతావరణం నెలకొందని పలువురు తెలిపారు. మరికొంతమంది అధికార పార్టీని నమ్ముకొన్న ఆశావహులు ప్రభుత్వం పథకాలపై భరోసా ఉన్నారు. చివరికి ఆశావహుల కోరికలు నెరవేరుతాయా? లేదా? అనే ఉత్కంఠ పరిస్థితి నెలకొంది.

విద్యుత్ ఆదా చేద్దాం ఇలా..

- చిట్కాలు పాటిస్తే 200 యూనిట్లలోపే వినియోగం



అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల వరకు జీరో బిల్లులు జారీ చేస్తోంది. అంతకంటే ఒక్క యూనిట్ ఎక్కువ అయినా మొత్తం డబ్బులను చెల్లించాల్సి ఉంటుంది. అందుకే విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే బిల్లు భారం నుంచి గట్టెక్కవచ్చు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)

ఇలా చేస్తే మేలు..

- విద్యుత్ పరికరాలు మార్కెట్‌లో చాలా కంపెనీలకు సంబంధించినవి అందుబాటులో ఉన్నాయి. ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, ఎల్‌ఈడీ బల్బులను 1-5స్టార్ల రేటింగ్‌తో విక్రయిస్తారు. వీటిలో 5 స్టార్ రేటింగ్ ఉన్న పరికరాలను మాత్రమే కొనుగోలు చేయాలి. వీటి ద్వారా విద్యుత్ ఆదా జరుగుతుంది.
- టీవీని అవసరం లేనప్పుడు రిమోట్‌తో కాకుండా పూర్తిగా బంద్ చేయాలి. ఫోన్‌చార్జ్ పూర్తయ్యాక చార్జర్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి. ఫ్యాన్లను అవసరం ఉన్నప్పుడు మాత్రమే వేసుకోవాలి.
- ఇంటిలో ఉపయోగించే రిఫ్రిజరేటర్‌లో ఫ్రీజర్‌ను దశలను కాలానుగుణంగా మార్చుకోవాలి. ఇళ్లలో పూర్తిగా ఎల్‌ఈడీ బల్బులను వినియోగించాలి.
- ఏసీలను 24 నుంచి 28 డిగ్రీల మధ్య నడుపుకోవాలి. మార్కెట్‌లో అనేక కంపెనీలు డ్యూయల్ ఇన్వర్టర్ ఏసీలను విక్రయిస్తున్నాయి. వీటితో గది మనం ఎంపిక చేసుకున్న ఉష్ణోగ్రతకు రాగానే ఆటోమెటిక్‌గా ఆగిపోతుంది. దీని ద్వారా విద్యుత్ ఆదా అవుతుంది. వేసవికి ముందే ఏసీల ఫిల్టర్లను శుభ్రం చేసుకోవాలి. ఏసీకి 2 నుంచి 5 గంటల వరకు టైమర్‌ను సెట్ చేసుకుంటే విద్యుత్ ఆదా అవుతుంది.
- యాదాద్రి జిల్లాలో 1,45,389 గృహజ్యోతి వినియోగదారులు ఉన్నారు.



పరికరం	సామర్థ్యం వాట్స్‌లలో	విద్యుత్ వినియోగం రోజు - గంటల్లో	నెలకు ఖర్చయ్యే యూనిట్లు
ఎల్‌ఈడీ బల్బులు	40	10	01
ఫ్యాన్	60	15	27
టీవీ	100	06	18
వాషింగ్ మిషన్	300	02	18
బోరు మోటారు	300	01	20
మిక్సీ గ్రైండర్	450	01	13
ఏసీ	1500	2-5	90-120
వాటర్ హీటర్	3000	01	12

చామలపల్లిలో రెండో తైలపుడు
కాలంనాటి శివాలయం

- ప్రముఖ చరిత్రకారుడులింగమూర్తి

చండూరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మండలం చామలపల్లి గ్రామంలో రెండో తైలపుడు కాలం నాటి శివాలయం ఆనవాళ్లు గుర్తించారు. నల్లగొండ జిల్లాలోని ప్రముఖ చరిత్రకారుడు ఎస్.లింగమూర్తి శివాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పరిశీలిస్తూ అక్కడ దొరికిన చారిత్రక ఆధారాలను పరిశీలించారు. వాయు లింగం, దేవాలయంలో బాణలింగం, ఇంకా వీరఘల్లు బొమ్మలు పరిశీలించి ఈ దేవాలయం తొమ్మిదో శతాబ్దం ప్రారంభంలో కళ్యాణ చాళుక్య రాజు రెండో తైలపుడి కాలంలో నిర్మించారని, ఈ శివాలయాన్ని వీరశైవం, వీర వైష్ణవం మధ్య వైషమ్యాల వల్ల ధ్వంసం చేశారన్నారు. ఇది సుమారు వెయ్యి ఏళ్ల క్రితం ధ్వంసమైందన్నారు. ఇలాంటి పురాతన దేవాలయాన్ని తిరిగి ఈ 21వ శతాబ్దంలో మళ్లీ గ్రామస్థులు పునర్నిర్మాణం చేయాలనుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. దేశవ్యాప్తంగా శైవాలయాలు ఎక్కువగా ఉన్నాయని, మరీ ముఖ్యంగా తెలంగాణలోని నల్లగొండ జిల్లాలో శైవాలయాలు లేని గ్రామం లేదన్నారు. ఆయన వెంట గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితుడి రిమాండ్

వలిగొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నమోదైన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన సంతోష్ ఈ నెల 18న మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ నెల 25న అతడిని పట్టుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



వెంకటేష్(ఫైల్)

రామన్నపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురం మూసీ నది వంతెన పైనుంచి కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన కొలగాని వెంకటేష్(58) వృత్తిరీత్యా తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. మంగళవారం పనినిమిత్తం మోటర్‌సైకిల్‌పై లక్ష్మాపురం గ్రామానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు దారిలో వంతెన పైనుంచి కింద పడి మృతి చెందాడు. ఉదయం వాకింగ్‌కు వచ్చిన జోగుల నరసింహ మోటార్ సైకిల్ ఆధారంగా గ్రామస్థులకు సమాచారమిచ్చాడు. ఈ మేరకు కుమారుడు కొలగాని మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి ..



గుర్తుతెలియని మృతదేహం

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13వ తేదీన పట్టణంలోని అంజనాపురికాలనీ క్రాస్‌రోడ్డు వద్ద హైదరాబాద్-విజయవవాడ జాతీయ రహదారిపై రాజుగారి హోటల్ ఎదుట ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో విజయవాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు చికిత్సనిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి సుమారు 35 నుంచి 40ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడని, ప్రస్తుతం మృతదేహం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీలో ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గానీ, పట్టణ ఇన్‌స్పెక్టర్ సెల్ 8712686005కు తెలపాలన్నారు.

పాము కాటుకు గీత కార్మికుడు..



శంకర్‌గౌడ్(ఫైల్)

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం తొండ్లాయి గ్రామంలో పాముకాటుకు గురై కల్లు గీత కార్మికుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దంతూరి శంకర్‌గౌడ్(30) కల్లుగీస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టుఎక్కాడు. కల్లు గీస్తుండగానే తాటి కమ్మల మధ్యలో నుంచి కాలుపై పడిన ఓ పాము శంకర్‌ను కాటేసింది. అప్పటికే కళ్లు తిరగడం, శరీరంలో రంగు మార్పిడి జరుగుతుండటంతో వెంటనే తాటిచెట్టు నుంచి కిందకు దిగిన శంకర్ స్పృహ కోల్పోయాడు. అయితే కల్లు సేవించేందుకు అప్పటికే అక్కడకి వచ్చిన ఇద్దరు గ్రామస్థులు శంకర్‌ను హుటాహుటిన నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శరీరమంతా విషమెక్కి శంకర్ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. కాగా మృతుడు శంకర్‌కు భార్య మౌనిక ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తిగత సమస్యలతో
రైతు ఆత్మహత్య



బాలరాజు(ఫైల్)

కేతేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో జీవితంపై విరక్తితో క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కేతేపల్లిలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ శివతేజగౌడ్ తెలిపిన మేరకు కేతేపల్లికి చెందిన గుండిగ బాలరాజు(51) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.ఇటీవల అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాలరాజు బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి నకిరేకల్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలరాజు భార్య జోస్పిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి నకిరేకల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఆలేరులో వరంగల్ జిల్లా యువకుడు...

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు గ్రామశివారులో వరంగల్ జిల్లా నర్సంపేట విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రజనీకర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామశివారులోని కాల్వ పక్కన తుమ్మచెట్టుకు ఉరివేసుకుని ఉన్న వ్యక్తిని బుధవారం గ్రామానికి చెందిన రామనర్సింహారెడ్డి చూసి పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అక్కడ ఉన్న ద్విచక్ర వాహనం ఆధారంగా మృతుడు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్యాలమ్మతండా గ్రామానికి చెందిన బానోతు వెంకన్న(24)గా గుర్తించారు. మృతుడు విద్యార్థి అని ఎస్‌ఐ రజినికర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు.

అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచింగ్: డీఎస్పీ

- తొలిప్రయత్నంలో దొరికిన యువకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చి విలాసంగా గడిపేందుకు సులువుగా డబ్బు సంపాదించడానికి స్నాచింగ్ మార్గాన్ని ఎంచుకున్న ఇద్దరు యువకులు తొలి ప్రయత్నంలోనే కటకటాల పాలయ్యారు. దొంగతనం చేసిన బంగారు గొలుసును విక్రయించేందుకు వెళ్తుండగా నల్లగొండ జిల్లా పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంలలో వారం రోజుల క్రితం రోడ్డుపక్కగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి తులంన్నర విలువైన బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు లాక్కుని పరారయ్యారు. ఘటనపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదుచేసింది. కాగా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక బృందాలు పక్కా సమాచారంతో ఈనెల 25న నార్కట్‌పల్లిలోని నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద స్థానిక పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా టీఎస్13ఈయూ8467 ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిలో ఖమ్మం పట్టణంలోని బాపూజగ్జీవన్‌రాం కాలనీ చెందిన నల్లమల్ల రఘు కొంతకాలంగా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో నివాసముంటూ హోటల్ నిర్వహిస్తున్నాడు.ఇంకో బాలనేరస్తుడితో కలిసి బీ.వెల్లెంలలో మహిళ మెడలో నుంచి చోరీ చేసిన బంగారు గొలుసును విక్రయించేందుకు చిట్యాలకు వెళ్తున్నట్లు విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. బాలనేరస్తుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నేరస్తులను స్వల్పకాలంలోనే పట్టుకుని కేసును ఛేదించిన సీసీఎస్ సీఐ సోమనర్సయ్య, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ సీసీఎస్ ఏఎస్‌ఐ యాదగిరిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, రాంప్రసాద్, వాహిద్, కానిస్టేబుళ్లు అఖిల్, సాయికుమార్, హరి ప్రసాద్‌లను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

దర్వాజను చీల్చుకుని వచ్చి గాయపరిచి

- వీధిలో పగిలిన వాటర్ ట్యాంకర్ టైరు
- దర్వాజను చీల్చుకుని ఇంట్లోకి డెక్స్
- ఇంట్లో ఉన్న వృద్ధురాలికి తగిలి గాయాలు



చికిత్స పొందుతున్న రామలక్ష్మి

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : రహదారిపై వెళ్తున్న వాటర్ ట్యాంకర్ టైరు పగిలిన ఘటనలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో జరిగింది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక అర్బన్‌కాలనీలో నీటిని విక్రయించే గోపాల కృష్ణకు చెదిన ప్రైవేటు వాటర్ ట్యాంకర్ కదులుతుండగానే వెనుక టైరు పగిలింది. దీంతో పగిలిన టైరు నుంచి వెలువడిన ఒత్తిడితో టైర్ డెక్స్ నుంచి వేరుపడిన రింగ్ పక్కనే మూసిఉన్న ఇంటి దర్వాజాను చీల్చుకుని లోపల మంచంపై కూర్చుని ఉన్న రామలక్ష్మికి తాకింది. దీంతో ఆమె కాలు విరగడంతో పాటు తలకు గాయాలయ్యాయి. క్షణాల వ్యవధిలో జరిగిన ఈ పరిణామంతో కోలుకున్న వెంటనే కుటుంబసభ్యులు ఆమెను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాలు విరగడంతో పాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన రామలక్ష్మి సోదరుడు భువనగిరి అర్బన్ కాలనీకి చెందిన సత్యనారాయణరెడ్డి ఇటీవలె మృతి చెందాడు. ఈ నేపథ్యంలో తమ్ముడి కుటుంబాన్ని పరామర్శించడానికి రామలక్ష్మి వచ్చింది. గాయపడిన తీరు స్థానికంగా సంచలనం సృష్టించింది. అయితే ఎంవీఐ కార్యాలయం జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేనందునే ట్యాంకర్ కండీషన్ అధమంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన దర్వాజ, పగిలిన టైరు

టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ నేడే

(5వ పేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సుందర్‌రాజ్‌యాదవ్ ప్రధానంగా పోటీ పడుతున్నారు. వీరితో పాటు మరో 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో నలుగురు పీఆర్టీయూ నేపథ్యం ఉన్నవారు కావడంతో ఈ ఎన్నికపై ఉపాధ్యాయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అభ్యర్థులంతా ఎవరికి వారు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వారికి మద్దతిచ్చే సంఘాలను, నాయకులను రంగంలోకి దించి ఉపాధ్యాయులను వారి వైపునకు తిప్పుకునే ప్రయత్నాలు చివరి వరకు చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అధికారికంగా ఎవ్వరికీ మద్దతు ఇవ్వకపోయినా, ఆ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధుల ద్వారా ఉపాధ్యాయులు వారికి అనుకూలంగా ఓటు వేసేలా ఫోన్లు, ఇతరత్రా సందేశాలు పంపించారు. మొత్తంగా హోరాహోరీగా ఎన్నిక జరగనుండడంతో అందరి దృష్టి గురువారం జరిగే పోలింగ్‌పై నెలకొంది.

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు

ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి, భద్రతా సిబ్బందికి ఇబ్బంది లేకుండా ఉండేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా ఎండ వేడి తట్టుకునేందుకు షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు. తాగునీరు, విద్యుత్ సదుపాయంతో పాటు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ప్రతీ కేంద్రం వద్ద అందుబాటులో ఉంచారు. ప్రతి కేంద్రం వద్ద మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రారంభమయ్యే గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుంది.

బ్యాలెట్ బాక్సులన్నీ నల్లగొండకే

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ ముగియగానే ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులన్నీ నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరనున్నాయి. నల్లగొండలోని ఆర్జాలబావివద్ద ఉన్న స్టేట్‌వేర్‌హౌసింగ్ గోదాముల్లో స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశారు. అక్కడే మార్చి 3న కౌంటింగ్ నిర్వహించనున్నారు. గురువారం నియోజకవర్గం పరిధిలోని 200 పోలింగ్ కేంద్రాల నుంచి పోలింగ్ ముగిశాక ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ బాక్సులన్నీ పోలీస్ భద్రత నడుమ నల్లగొండలోని స్ట్రాంగ్ రూములకు చేరనున్నాయి. స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర బలగాలతో పాటు, ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. మొత్తం ఐదు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు బలగాలను నియమిస్తున్నాం. పోలింగ్ లొకేషన్ల వద్ద స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచాం. రూట్ మొబైల్ ఆర్మ్‌డ్ పార్టీలను నియమించాం. మొత్తం 518 మంది పోలీసులను పోలింగ్ విధుల్లో నియమించాం. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కూడా సెంట్రల్ ఫోర్స్‌తో పాటు ఏఆర్ పోలీసులను నియమించాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకున్నాం.

శరత్‌చంద్ర పవార్, నల్లగొండ జిల్లా ఎస్పీ

వివాహిత మహిళలు అదృశ్యం

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు సంఘటనలో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణం కేపీఆర్ వెంచర్‌లో నివాసముంటున్న దేశగోని అలివేలు(34), మండలంలోని కైతాపురం గ్రామానికి చెందిన గోపనబోయిన లావణ్య(27)లు మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్తున్నామని చెప్పి అదృశ్యమయ్యారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం వారి భర్తలు గోపనబోయిన లింగస్వామి, దేశగోని మల్లేశ్ వేర్వేరుగా ఫిర్యాదు చేశారని, ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోవుల పట్టివేత

భువనగిరిటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జంతు వధశాలకు అక్రమంగా తరలిస్తున్న ఆవులను బుధవారం తెల్లవారుజామున యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో బజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ బహదూర్‌పూర్ జంతు వధశాలకు ఆవులను తరలిస్తున్నట్లు అందిన సమాచారాన్ని బజరంగ్‌దళ్ కార్యకర్తలు పోలీసులకు చేరవేశారు. ఈ మేరకు ఇరువర్గాలు భువనగిరి బైపాస్‌పై ఆవులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని 21 ఆవులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆవులను హైదరాబాద్ జియాగూడ గోశాలకు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ బింగి భరత్‌కుమార్, పట్టణ కన్వీనర్ నెమిలి నవీన్, ఉడుత ఆనంద్, రాకేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ దుకాణాల సబ్‌లీజ్ దందా!

- రూ.వేలలో సబ్‌లీజ్‌కు దుకాణాలు
- ఆర్టీసీకి నామమాత్రం చెల్లింపు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



యాదగిరిగుట్టలోని ఆర్టీసీ బస్టాండ్

యాదగిరిగుట్టరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్లలో దుకాణాలు డిపాజిట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(డీవోటీ) ప్రాతిపదికన అద్దెకు తీసుకున్న వాళ్లలో చాలామంది సబ్‌లీజ్ దందా సాగిస్తున్నారు. సబ్‌లీజ్‌తో భారీగా ఆదాయం వస్తుండగా ఆర్టీసీకి మాత్రం నామమాత్రం అద్దె చెల్లిస్తున్నారు. తామే సొంతంగా వ్యాపారం నిర్వహిస్తామని లీజ్‌కు తీసుకున్న చాలామంది సబ్‌లీజ్‌కు ఇచ్చి చేతులుదులుపుకున్నారు. డీవోటీ పద్ధతిలో ఆర్టీసీకి ముందుగా కొంతడబ్బు డిపాజిట్ చేసి, స్వయంగా దుకాణాలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది.ఇందు కోసం నామమాత్రం అద్దెతో 20ఏళ్ల వరకు లీజ్‌కు ఇచ్చారు. అయితే గడువు ముగిసిన తర్వాత సంస్థ స్వాధీనం చేసుకొని బహిరంగ వేలం వేయాల్సి ఉంటుంది. డిపాజిట్ చేసి లీజ్‌కు తీసుకున్న వారు స్వయంగా దుకాణాలను నిర్వహించాలని నియమం ఉంది. అయితే ఆ నిబంధనను గాలికి వదిలేసీ యథేచ్ఛగా సబ్‌లీజ్‌కు ఇస్తూ రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. యాదగిరిగుట్ట డిపో పరిధిలోని యాదగిరిగుట్ట, ఆలేరు, భువనగిరి, రామన్నపేట బస్టాండ్లలో మొత్తం 101 దుకాణాలను 10 ఏళ్ల కిందట డీవోటీ పద్ధతిలో కేటాయించారు. డీవోటీ దుకాణాలకు నెలకు రూ.3 నుంచి రూ.4 వేల చొప్పున చెల్లిస్తున్న లీజ్‌దారులు సబ్‌లీజ్‌కు నెలకు రూ.30వేలు, మరికొందరు రోజుకు రూ. 3 వేల నుంచి రూ.5వేల వరకు దండుకుంటున్నారు. అటు ఆర్టీసీకి నామమాత్రంగా చెల్లిస్తున్నారు. మరికొందరు బడా వ్యాపారులు డీవోటీ దుకాణాలు పొందిన వారికి డిపాజిట్ కంటే రెండింతలు ఇచ్చి అక్రమంగా లీజ్ దుకాణాలను అక్రమంగా తమ పేర్ల మీద మార్చుకొని అక్రమ దందా కొనసాగిస్తున్నారు. పట్టణంలో నిరుపేదలు, నిరుద్యోగులు ఉపాధి కోసం దుకాణాలను నిర్వహించుకోవడానికి అవకాశం లేకుండా సబ్‌లీజ్ భాగోతం ఆటంకంగా మారింది. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. సబ్‌లీజ్‌కు ఇచ్చిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కిందిస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కొందరు అధికారులకు ముడుపులు ముడుతుండటంతో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

సబ్‌లీజ్‌కు ఇచ్చిన దుకాణాలను రద్దు చేయాలి



ఆర్టీసీ బస్టాండ్లలో డీవోటీ పేరుతో దుకాణాలు పొంది సబ్‌లీజ్‌కు ఇచ్చిన లైసెన్సులను రద్దు చేయాలి. ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న వారిపై విచారణ జరిపించి చర్యలుతీసుకోవాలి.రద్దుచేసిన దుకాణాలను పేదలకు నామమాత్రం అద్దెకు ఇచ్చి జీవనోపాధి కల్పించాలి.

● కర్రె ప్రవీణ్, యాదగిరిగుట్ట

డీవోటీ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ



బస్టాండ్లలో డీవోటీ పద్ధతిలో దుకాణాలు పొంది సబ్‌లీజ్‌కు ఇచ్చి రూ.లక్షలు దండుకుంటున్న వారిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నెలకు నామమాత్రం ఆర్టీసీకి చెల్లించి రూ.లక్షలు దండుకుంటున్నా వారిపై చర్యలు లేవు.

సీస శ్రీనివాస్‌గౌడ్, యాదగిరిగుట్ట

ఫిర్యాదు చేస్తే డీవోటీ లీజ్ రద్దు చేస్తాం

గుట్ట ఆర్టీసీ డిపో పరిధిలో డీవోటీ పద్ధతిలో దుకాణాలు పొంది సబ్‌లీజ్‌కు ఇచ్చినట్లు ఆధారాలతో ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం. సబ్‌లీజ్‌కు ఇచ్చివాటిని వెంటనే రద్దు చేసి బహిరంగ వేలం వేస్తాం. డీవోటీ దుకాణదారుల వద్ద ముడుపులు తీసుకుంటున్నామనడం అవాస్తవం.

● బందారపు శ్రీనివాస్‌గౌడ్, డీఎం

శివకేశవుల క్షేత్రంలో వైభవంగా.. శత రుద్రాభిషేకం


యాదగిరిక్షేత్రంలోని రామలింగేశ్వరాలయంలో శివలింగం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామి శివాలయంలో నాలుగో రోజు బుధవారం మహా శివరాత్రి మహోత్సవాలు విశేషంగా కొనసాగాయి. పురోహిత, రుత్విక బృందాలు ఉదయం నిత్యవిధి పూజలు, హవనాలు, శివపంచాక్షరి జపాలు, నందీశ్వర పారాయణాలు, పంచసూక్త పఠనాలు, మూల మంత్ర జపాలు, చతుస్థానార్చనలు శైవాగమ సంప్రదాయరీతిలో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరంగా అభిషేక పూజలు నిర్వహించారు. శివరాత్రి మహత్యాన్ని దేవస్థాన సిద్ధాంతి సత్యనారాయణశర్మ భక్తులకు వివరించారు. రాత్రి వేళ లింగోద్భవ కాలంలో ఆలయ పురోహిత, రుత్విక బృందాలు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకాలు చేపట్టారు. ఆధ్యాత్మిక పర్వాలను శివాలయ ప్రధానార్చకులు గౌరీభట్ల నర్సింహాచార్యులు, పురోహిత, రుత్విక బృందం నిర్వహించగా ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నర్సింహమూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, రఘు, దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకులు ధీరావత్ రామరావునాయక్, రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

చరమూర్తులు కొలువైన శివాలయంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ఎంతో ఉపవాస దీక్షలను చేపట్టిన భక్తులు సాయంత్రం వేళ పరమశివుని అభిషేక, అర్చనల, దర్శన అనంతరం క్షేత్రవీధుల్లో ఉపవాస దీక్షలు విరమించారు. రాత్రి సమయంలో భజనలు, కీర్తనలతో యాదగిరి క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది.


యాదగిరికొండపై నృత్యం చేస్తున్న చిన్నారులు

అఖండ జ్యోతి యాత్ర ప్రారంభం


అఖండ జ్యోతి యాత్రను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

భువనగిరి అర్బన్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహోత్సవాల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ఏటా తరలివచ్చే అఖండ జ్యోతి ప్రారంభమైంది. జ్యోతిని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ ప్రారంభించగా బుధవారం బర్కత్‌పురలోని యాదగిరి భవన్ నుంచి యాత్ర ప్రారంభమైంది. హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు సుమారు 56 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగుతుండగా ఊరూరా దారి పొడవున మంగళహారతులతో భక్తులు స్వాగతం పలుకనున్నారు. ఏటా వార్షిక బ్రహోత్సవాల నాటికి యాదగిరిగుట్టకు చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యాత్రకు కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాలు, సన్నాయిమేళాలతో ఘన స్వాగతం లభించనుంది. కొండకింద వైకుంఠద్వారం వద్దకు యాత్ర చేరుకుంటుంది. కాగా, గతంలో చెక్‌పోస్టు సమీపంలో విగ్రహాలను నిలిపేందుకు ఆలయ అధికారులు స్థలం నిర్ధారించారు. ఆలయ పునర్నిర్మాణం పూర్తయిన తర్వాత ఇప్పటివరకు ఇక్కడకు చేరుకున్న విగ్రహాలను అధికారులు నిలిపేందుకు చోటు నిర్ధారించకపోవడంతో తిరిగి నిర్వాహకులే తీసుకువెళ్తున్నారు. గిరిప్రదక్షిణ ప్రదేశమైన వైకుంఠద్వారం వద్ద మొక్కులు తీర్చుకునే అవకాశం కల్పించాలని స్థానిక భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

యాదగిరీశుడి బంగారు గోపురం ధగధగ


ధగధగ మెరుస్తున్న విమాన గోపురం

భువనగిరి అర్బన్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి బంగారు గోపురం ధగధగ మెరుస్తుండటంతో భక్తులు పరవశించిపోయారు. ఈ నెల 23న వానమామలై మఠం 31వ పీఠాధిపతి, మధుర కవి రామానుజ జీయర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో బంగారు విమానగోపురానికి సీఎం రేవంత్‌రెడ్డి సంప్రోక్షణ మహాకుంభాభిషేకం చేశారు. ఆలయం పూర్తి కృష్ణ శిలల(నలుపు) రాతితో నిర్మితం కాగా సప్త గోపురాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి పంచతల బంగారు గోపురం మెరిసిపోతోంది. ఈ గోపురం చుట్టూ కోతుల నుంచి రక్షణగా సోలార్ ఏర్పరచి రెండు రోజుల్లో ఎంఎస్ జాలీ బిగించనున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. మంగళవారం రాత్రి వరకు పరంజాను కూలీలు తొలగించారు. గోపురం చుట్టూ బిగించిన కర్రలు తీసేయడంతో బంగారు గోపురం పూర్తిగా కన్పించి భక్తులను కనువిందు చేసింది.

యాదగిరీశుడికి నిత్యపూజలు

భువనగిరి అర్బన్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిఅమ్మవారలను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారలను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు.

మేళ్లచెర్వు శివాలయానికి పోటెత్తిన భక్తులు

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ దంపతులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతర సందర్భంగా మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్సవాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు పాల్గొని, స్వామి వారికి అభిషేకాలు చేయించారు. అనంతరం ఆలయ అర్చకులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి బుధవారం ఒక్కరోజే 60 నుంచి 65 వేల మంది వచ్చారని అధికారులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా : మంత్రి ఉత్తమ్

30 ఏళ్లుగా శివరాత్రి వేడుకల్లో వివిధ హోదాలలో పాల్గొంటున్నానని, ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తన హయాంలోనే శివాలయం రూపు రేఖలు మారిపోయాయని, జాతర నిర్వహణ కోసం వరుసగా రెండో సంవత్సరం రూ.కోటి మంజూరు చేయించానన్నారు.

ఒంగోలు జాతి పశువులను కాపాడుకోవాలి

ఒంగోలు జాతి పశువులను కాపాడుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఒంగోలు జాతి ఎద్దుల పోటీలను ఆమె బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పోషం నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, ఆలయ ఈవో కొండారెడ్డి, ఛైర్మన్ శంభిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షుడు శెట్టి రామచంద్రరావు, పద్మ పాల్గొన్నారు.


క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

ఆ ఎనిమిది మందిని కాపాడేందుకు

ప్రభుత్వం సర్వశక్తులను ఒడ్డుతోంది

● మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా కాపాడేందుకు ప్రభుత్వం సర్వశక్తులను ఒడ్డుతోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరిశీలించారు. టన్నెల్‌లో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులు, సహాయక బృందాలు చేపట్టిన చర్యలను సంబంధిత అధికారులతో రాజగోపాల్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులను రప్పించి టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలను చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పదేళ్లపాటు సొరంగమార్గాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని, ప్రస్తుత దుర్ఘటనకు కేసీఆర్, బీఆర్ఎస్‌లే బాధ్యత వహించాలన్నారు. ఏ ముఖం పెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు టన్నెల్ వద్దకు వస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.2వేల కోట్లు కేటాయించి ఉంటే ఈ సొరంగం పూర్తయి జిల్లావాసులకు సాగు, తాగు నీరు లభించేదన్నారు. ప్రాజెక్టులకోసం బీఆర్ఎస్ రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చిందేకానీ, ఎస్ఎల్‌బీసీకి నిధులు కేటాయించకుండా జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు చేపట్టిందని, జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతోపాటు తానూ సంబంధిత కంపెనీలతో చర్చించి పనులను మొదలు పెట్టించామన్నారు. పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో ఈ ప్రమాదం నెలకొనడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మునుగోడు ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, మాజీ జడ్పీటీసీ చిల్కూరి ప్రభాకర్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, బ్లాక్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనా రెడ్డి తదితరులున్నారు.

ఆర్టీసీ.. ఆధునికం

● ఎలక్ట్రిక్ బస్సులు.. నూతన టిమ్‌లు ● 'చిల్లర' కష్టాలకు చెక్


మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్

ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంలో ఆర్టీసీ అప్‌డేట్ అవుతోంది. ప్రయాణికులకు నాణ్యత, సౌకర్యాలతో కూడిన సేవలందించేందుకు సిద్ధపడిన యాజమాన్యం టీఎస్ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ఇప్పటికే ప్రయోగాత్మకంగా ప్రారంభించి విజయవంతమైంది. పర్యావరణహిత ఇంధనంతో నడిచే ఆధునిక బస్సుల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనుంది.

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)

ఉమ్మడి జిల్లాకు 132 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండకు 72 బస్సులు రానుండగా, సూర్యాపేట డిపోకు మరో 60 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయి. బస్సులు విద్యుత్ సామర్థ్యంతోనే నడవనుండగా ఆయా డిపోల్లో గతేడాది చివర చార్జింగ్ పాయింట్ల పనులు ఆరంభించారు. అయితే పనులు పూర్తయ్యేందుకు ఐదు నుంచి ఏడు నెలల సమయం పట్టనుండగా ఆర్థిక సంవత్సర చివరాంకంలో ఎలక్ట్రిక్ బస్సులు 'రయ్'మంటాయని అధికారులంటున్నారు.

కాస్త దూరంలో ఆగిన మిర్యాలగూడ

ఒకసారి చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు 280 నుంచి 300 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంటాయి. అయితే మిర్యాలగూడ పట్టణం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ 144 కిలోమీటర్లుండగా, రానూపోనూ కలిపి సుమారు 290 కిలోమీటర్లు అవుతుంది. మధ్యలో వంకర, టింకరలు, ట్రాఫిక్ జామ్‌లు కలిపి రెండు మూడు కిలోమీటర్ల పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో 280 నుంచి 300 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం కలిగిన ఎలక్ట్రిక్ బస్సులను మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు కేటాయింటే అవకాశం లేదంటున్నారు ఆర్టీసీ ఉన్నతాధికారులు. బస్ చార్జింగ్ కెపాసిటీకి బార్డర్‌లో ఉన్నందున మిర్యాలగూడకు ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు జరగలేదు. భవిష్యత్‌లో చార్జింగ్ కెపాసిటీ పెరిగితే అందుకు తగ్గట్లు చర్యలు తీసుకుంటామంటున్నారు.

ఆధునిక టిమ్‌లతో తప్పనున్న ఇబ్బందులు

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ఆర్టీసీ మరో ముందడుగు వేసింది. టిమ్ (టికెట్ ఇష్యూయింగ్ మిషన్) వినియోగంతో కొత్త పద్ధతిని అనుసరించనుంది. చిల్లర సమస్యకు చెక్ పెట్టడంతోపాటు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. అందుకు ఇంటలిజెంట్ టికెట్ ఇష్యూ మిషన్(ఈ-టిమ్)లను తమ ఉద్యోగులకు అందించనుంది. ఈ-టిమ్‌లతో ప్రయాణికులు తమ యూపీఐ యాప్స్‌తో టికెట్‌ను సులభంగా కొనుగోలు చేయొచ్చు. ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన ఈటిమ్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడమే కాకుండా డెబిట్ కార్డ్ ద్వారా పేమెంట్ చేసి టికెట్ కొనుక్కోవచ్చు. ఇక మహలక్ష్మీ పథకంలో భాగంగా ఆధార్ కార్డ్‌ను చూపించి జీరో టికెట్ కొనుగోలు చేస్తున్న మహిళలకు ఆధార్ తరహాలో స్మార్ట్ కార్డులను(ఆర్టీసీ బసులో ప్రయాణానికి మాత్రమే) జారీచేసే ఆలోచనలో యాజమాన్యముంది. ఆయా స్మార్ట్ కార్డులను ఈ- టిమ్‌లో స్వైప్ చేసి జీరో టికెట్ పొందొచ్చు. ఇక ఈ మిషిన్స్‌తో ఆదాయ సమాచారం అప్పటికప్పుడు తెలుసుకోవడంతోపాటు బస్సు కదలికలు, ఉద్యోగుల పనితీరుపై సమగ్ర సమాచారం పొందే వీలుందని ఆర్టీసీ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఈ-టిమ్‌లపై శిక్షణనిస్తున్నాం



ప్రయాణికులకు సురక్ష, నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. నల్లగొండ, సూర్యాపేట డిపోలలో ఎలక్ట్రిక్ బస్సుల సేవలు త్వరలో ప్రారంభంకానున్నాయి. ఇక ప్రయాణికులకు డిజిటల్ సేవలందించేందుకు ఈ-టిమ్‌లను వినియోగించనున్నాం. అత్యాధునిక సాంకేతికతతో రూపొందిన ఈ టిమ్‌లను రీజనల్ పరిధిలోని అన్ని డిపోలకు అందిస్తాం. ఇప్పటికే 400 టిమ్ములు వచ్చి ఉండగా.. ఆయా టిమ్‌ల వినియోగంపై కండక్టర్లకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం.

కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్

జాతీయస్థాయి హాకీ పోటీలకు కల్పన



చిట్యాలరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీపోటీలకు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన మర్రి కల్పన ఎంపికైనట్లు నల్లగొండ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కూతురు శ్రీనివాస్ రెడ్డి, ఇమామ్ కరీం తెలిపారు. ఈనెల మొదటి వారంలో గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపికలో కల్పన తన అద్భుత ప్రదర్శనను కనబరచడంతో సెలక్టర్లు ఆమెను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వచ్చే మార్చి మాసం 1వ తేదీన హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో కల్పన పాల్గొననున్నది. జాతీయస్థాయికి ఉరుమడ్ల యువతి ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నీటితొట్ల నిర్వహణపై పట్టింపేదీ?

● వేసవితాపంతో మూగజీవాల రోదన

చింతపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభమవడంతో చెరువులు, బావుల్లో నీరు అడుగంటాయి. దీంతో గొర్రెలు, మేకలు ఇతర మూగజీవాలకు తాగునీటి సౌకర్యం సక్రమంగా లేక అల్లాడిపోతున్నాయి. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు పలు గ్రామాల్లో నీటి తొట్లు నిర్మించగా వాటిల్లో నీరు నింపకపోవడంతో పశువుల దాహార్తి తీరని దుస్థితి. చింతపల్లి మండలంలో 34 గ్రామపంచాయతీలున్నాయి. వీటిలో 30 గ్రామాల్లో ఆవులు 9540, గేదెలు 6336, గొర్రెలు 35,227, మేకలు 9,335 ఉన్నాయి. ఇవన్నీ రోజు మేతకు వెళ్లి అక్కడున్న చెరువుల్లో నీరు తాగేవి. వర్షాలు చెరువుల్లో నీరు అడుగంటాయి. దీంతో వాటికి తాగేందుకు నీరు లేక అల్లాడుతున్నాయి. మండలంలో ఏర్పాటు చేసిన నీటి తొట్ల నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి.

నిరుపయోగంగా నీటితొట్లు

మద్దిరాల: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో ఆరేళ్ల క్రితం ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో నీటి తొట్ల చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు మొలవగా మరికొన్ని గ్రామాల్లో శిథిలావస్థకు చేరి వాటిలో నీరు నిల్వ ఉండడంతో పాకురు ఏర్పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిర్మించిన నీటి తొట్లు ఉపయోగం లేకుండా పోయాయి. పశువులు, మేకలు, గొర్రెలు, గేదెలకు తాగునీరు అందడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు గోరెంట్ల, పోలుమళ్ల, మామిళ్లమడవ, చందుపట్ల, రెడ్డిగూడెం, కుక్కడం గ్రామాల్లో నీటితొట్లు ఉన్నాయి. ఒక్కొ నీటి తొట్టి నిర్మాణానికి రూ.24వేలు కేటాయించారు. అధికారుల నిర్లక్ష్యంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా మండలంలోని నీటి తొట్లను శుభ్రపర్చి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.


మద్దిరాల మండలం చందుపట్లలో పాకురుపట్టిన నీటితొట్టి


చింతపల్లి మండలం గొల్లపల్లిలో శిథిలావస్థకు చేరిన నీటి తొట్టి

వినియోగంలోకి తేవాలి



గ్రామంలో వ్యవసాయానికి అనుసంధానంగా చాలా మంది రైతులు పశువులను, గేదెలను పెంచుతున్నారు. గొర్రెలకాపరులకు వందల సంఖ్యలో మూగజీవాలున్నాయి. వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో నీటి తొట్లలో నీరు ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలి. కొన్ని గ్రామాల్లో నీటి తొట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. నిధులు మంజూరు చేయించి త్వరగా మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తేవాలి.

బాదేపల్లి కృష్ణయ్య, రైతు, గొడకొండ్ల, చింతపల్లి

మరమ్మతులు చేయిస్తాం



గ్రామాల్లో నిరుపయోగంగా మారిన నీటితొట్లను ఉపయోగంలోకి తేవడానికి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తాం.

సుజాత, ఎంపీడీవో, చింతపల్లి

కనుమరుగవుతోన్న చేతిపంపులు

● మరమ్మతులకు నోచని వైనం ● అత్యవసర సమయాల్లో నీటికోసం ప్రజల ఇబ్బందులు


భువనగిరి మండలం చీమలకొండూరు, వీరవెల్లిలో మరమ్మతుకు నోచని చేతిపంపులు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో నీటి అవసరాలు తీర్చే చేతి పంపులు మరమ్మతులకు నోచక నిరుపయోగంగా మారాయి. భువనగిరి నియోజకవర్గ పరిధిలోని భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, బీబీనగర్ మండలాల మూసీ పరివాహక ప్రాంతాల్లో భూగర్భజలాలు అందుబాటులో ఉన్నా చేతి పంపులకు మరమ్మతులు చేపట్టేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగానికి చెందిన మెకానిక్‌లు లేకపోవడంతో చిన్న చిన్న మరమ్మతులు ఏర్పడినప్పటికీ చేతిపంపులు నిరుపయోగంగా మారాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు, కాళేశ్వరం ద్వారా గోదావరి నీటి సరఫరా అయ్యే పైపులైన్‌లకు తరుచూ మరమ్మతులు వచ్చినప్పుడు ప్రత్యామ్నాయంగా అత్యవసరంగా చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ సమయంలో చిన్న మరమ్మతులకు కూడా నోచకపోవడంతో చేతిపంపుల వినియోగం నిరూపయోగంగా మారింది. దీంతో అత్యవసర సమయాల్లో చేతి పంపుల వినియోగం లేకపోవడంతో ప్రజలు కొంత మేర ఇబ్బందులకు గురవుతున్నారు. 2018 నుంచి గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించిన మెకానిక్‌ల రిక్రూట్‌మెంట్ జరగకపోవడం కూడా ఓ కారణంగా అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా పర్యవేక్షణ కొరవడడం వల్ల చేతి పంపుల ప్లాట్ ఫామ్‌లు, నీటి ద్వారా వచ్చే పైపు వరకు నేలమట్టం అవడంతో ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. ఇప్పటికైనా చేతిపంపులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

మెకానిక్‌లతో మరమ్మతులు చేయిస్తాం



ఎండకాలం సమీపిస్తుండడం, భూగర్భజలాలు ఉన్న ప్రాంతాల్లో చేతి పంపులను పరిశీలించి మెకానిక్‌ల ద్వారా మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. చిన్న చిన్న మరమ్మతులు ఉన్న చేతి పంపులను గుర్తించి వాటికి కూడా మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తాం. ● గుండురావు , మిషన్ భగీరథ ఏఈ, భువనగిరి మండలం

మహిళా కాంగ్రెస్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా జానకి

కట్టంగూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా కట్టంగూరుకు చెందిన బొడ్డుపల్లి జానకి నియమితులయ్యారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమెకు నియమిస్తూ మహిళా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ప్రత్యేక పూజలు

మర్రిగూడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ పలువురు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ ఏర్పుల శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మర్రిగూడ నుంచి పాదయాత్ర ద్వారా చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామిని బుధవారం దర్శించుకున్నారు. పూజారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్, మల్లేష్, రమేష్, కార్తీక్ పాల్గొన్నారు.

బూరుగుచెట్టుకు ప్రత్యేక వసతుల నిర్మాణాలు

● రూ.1.20 లక్షల వ్యయంతో ఏర్పాట్లు

నల్లగొండకల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి గుట్ట దేవస్థానంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి బూరుగు చెట్టుకు రూ.1.20లక్షల వ్యయంతో నూతనంగా వసతుల నిర్మాణాలు చేసినట్లు విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్, పెందోటి సోములు తెలిపారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయంలో భక్తులు ఇబ్బందులు కలుగకుండా పలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

బ్రహ్మంగారి చెట్టు చుట్టూ రెండు ఫీట్ల రాతి రెయిలింగ్, గోడ దానిపైన మూడు ఫీట్ల స్టీల్ రెయిలింగ్, లోపల టైల్స్, స్వామివారి విగ్రహానికి మకరతోరణం, స్టీల్ గేటు, వివిధరంగుల లైటింగ్ వంటి వసతలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీపాద కృష్ణమాచారి, యాదగిరిచారి, రాచకొండ గిరి, కృష్ణ పాల్గొన్నారు.

బోనస్ కోసం ఎదురుచూపు

● జిల్లాలో 74,394 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు ● రూ. 10 కోట్ల మేర బకాయి

హాలియా, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా సన్న ధాన్యం పండించిన రైతులకు రూ. 500 ప్రకటి ంచడంతో రైతులు సన్నధాన్యం సాగుకు మొగ్గు చూపారు. అయితే మార్కెట్‌లో జేఎస్‌ఆర్, చింట్లు, పూజాగోల్డ్, హెచ్‌ఎంటీలు సాగు చేసిన రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకున్నారు. అయితే బీపీటీ, మహీంద్రాచిట్లు రకం సన్నధాన్యం సాగు చేసి న రైతు లకు ప్రభుత్వం అందించిన బోనస్ రైతులకు మరింత గిట్టుబాటు ధర అందేందుకు దోహదపడింది. నల్లగొండ జిల్లాలో ప్రభుత్వం 74,394 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని 15,879 మంది రైతుల నుంచి పీఏసీఎస్, ఐకేపీ, ఎఫ్‌పీవో కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసింది. సన్నధాన్యం కొనుగోలు చేసిన మొత్తం రూ.172.59 కోట్లు కాగా ఇంకా రైతులకు 10 కోట్ల మేర బకాయిలు చెల్లిం చాల్సి ఉంది. ధాన్యాన్ని రైతు లు కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మి రెండు నెలలు అవుతున్నా రూ. 500 ఇంకా పడలేదని బోనస్ డబ్బులు కోసం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను రైతులు ఆరా తీస్తున్నారు సన్నధాన్యం కొనుగోలు చేసిన రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2,320 చొప్పున వెంటనే వారి ఖాతాల్లోకి జమ చేశారు. వారం తర్వాత బోనస్ రూపాయలు కూడా రైతన్న ఖాతాలోకి నేరుగా జమ చేశారు. మిగిలిన బకాయిలు కూడా జమ చేస్తే రైతన్న పెట్టుబడులకు ఉపయో గకరంగా ఉంటుందని వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


హాలియాలో సన్నధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా అధికారులు (ఫైల్)

రెండు నెలలు అవుతున్నా జమ కాలేదు



సన్నధాన్యం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించి రెండు నెలలు అవుతున్నా రూ.500 బోనస్ ఖా తాలో పడలేదు. డబ్బుల కోసం ఇబ్బందులు పడుతున్నామని తొందరగా వస్తే పొలం పెట్టుబడికి ఉపయోగపడుతుంది.

దండా కొండల్, రాజవరం, తిరుమలగిరి(సాగర్)

మిగిలిన బకాయిలు నేరుగా జమ చేస్తాం



15,879 మంది రైతుల నుంచి సన్నధాన్యాన్ని 172 కోట్ల మేరకు కొనుగోలు చేశా మని చివరగా విక్రయించిన రైతు ఖాతాల్లో 10 కోట్ల మేరకు ఇంకా జమ చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని త్వరలోనే వారి ఖాతాల్లోకి నేరుగా బోనస్ సొమ్ము జమ కానున్నది.

హరీష్, డీఎం, నల్లగొండ

1న జిల్లాకు రానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సీపీఎం నూతన రాష్ట్ర కార్యదర్శి జాన్‌వేస్లీ మార్చి 1వ తేదీన నల్లగొండకు రానున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జిల్లాకు వస్తున్న సందర్భంగా మార్చి 1న నల్లగొండ బైపాస్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ద్విచక్రవాహన ర్యాలీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు, ఇతర సీపీఎం కమిటీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు విలేకరుల సమావేశం అనంతరం మిర్యాలగూడ రోడ్డులోని కోటిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జాతీయ మహాసభల ముసాయిదా తీర్మానం, రాజకీయ తీర్మానాలపై చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శితో పాటు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'తెలుగు తప్పనిసరిని స్వాగతిస్తున్నాం'

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగును అన్ని బోర్డుల్లో తప్పనిసరిచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ట్రస్మా రాష్ట్ర సలహాదారు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మాతృభాష ఔన్నత్యాన్ని చాటుతుందన్నారు. జాతీయ విద్యా విధానం (2020)ని ఇది అనుసరిస్తోందని ఫలితంగా మాతృభాష ఆధారిత విద్యావిధానాన్ని ప్రోత్సాహిస్తూ విద్యార్థుల్లో బౌద్ధిక మరియు భాషానైపుణ్యాలను మెరుగుపరుస్తుందని తెలిపారు. దీంతో పాటు మన సాంస్కృతిక మూలాలకు దగ్గర చేసే విధానమని, అదే విధంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం, ప్రభుత్వ ఉత్తర్వులను కూడా తెలుగులోనే ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విధానంతో ప్రభుత్వానికి పౌరుల మధ్య ఉన్న ఖాళీని పూరించే విధంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

హరహర మహాదేవ

● కిటకిటలాడిన శైవ క్షేత్రాలు ● వైభవంగా స్వామి వారి కల్యాణం ● వైభవంగా స్వామి వారి కల్యాణం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): హరహర మహదేవ.. శంభో శంకర... అంటూ భక్తులు శివనామస్మరణతో శైవక్షేత్రాలన్నీ మార్మోగాయి. ప్రసిద్ధమైన శైవక్షేత్రాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకొని అభిషేకాలు, రుద్రాభిషేకం, లింగాభిషేకాలు, కుంకుమార్చనలు, రుద్ర హోమాలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు రావడంతో భక్తుల సందడి నెలకొంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ క్యూలో నిలబడ్డారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు తగినట్టుగా ఏర్పాట్లను చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జాగరణ ఉన్న భక్తుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిభావంతో ఉండే పాటల కార్యక్రమాలు నిర్వహించారు. లింగోద్భవ కాల సమయంలో అర్చకస్వాములు అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందే శివపార్వతుల కల్యాణ వేడుకలను చూడ ముచ్చటగా జరిపారు. శివరాత్రి రోజున ఉపవాస దీక్షలు చేస్తే పుణ్యఫలం వస్తుందని భక్తులు ఉపవాస దీక్షలు చేసి రాత్రి సమయంలో జాగరణ చేశారు.

నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయం, పచ్చల సోమేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అర్చక స్వాములు ఉదయ్‌కుమార్, అజయ్‌కుమార్, నవీన్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో జిల్లా జడ్జి నాగరాజు దంపతులు, ఎస్పీ సతీమణి శరత్‌పవార్ పూజ, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, మాజీ కౌన్సిలర్లు ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రెగట్టే లింగస్వామి, గుండగోని యాదయ్య, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, ఆలకుంట్ల మోహన్‌బాబు, నాగరత్నంరాజు, ఎల్లయ్య, ఈవో బాలకృష్ణ పాల్గొన్నారు. అంతేకాకుండా పట్టణంలోని వీటీకాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలు చూడముచ్చటగా సాగాయి. కార్యక్రమంలో రావిరాల పూజిత వెంకటేశ్వర్లు, నూకల జయపాల్‌రెడ్డి, మేడం ప్రభాకర్, నాగులపల్లి శ్యాంసుందర్, రవీందర్, నాగార్జున, అనిత, భారతి పాల్గొన్నారు.

షేర్ బంగ్లాలోని సంతోషిమాత ఆలయంలో అర్చకులు రాంమోహనచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు కల్యాణాన్నినిర్వహించారు.

తులసీనగర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో విశాలక్ష్మి సహిత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని మాల్‌బౌలిలోని శివాలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, ఇందుపూర్‌లోని భక్తాంజనేయస్వామి, కంచనపల్లి గ్రామంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కంచనపల్లి గ్రామంలోని శంభులింగేశ్వర దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు చెన్నోజు నాగేంద్రశర్మ, రుక్మాకర్‌శర్మ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

● నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులను దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ వేదపండితులు ఆశీర్వదించారు. మండలంలోని నక్కలపల్లి గ్రామంలోని పార్వతీ సహిత జల రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన శివరాత్రి ఉత్సవాల్లో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు వడ్డే భూపాల్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, నేతగాని కృష్ణయ్య, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలోని బైరవునిబండ, చిత్తలూరు, శాలిగౌరారం, వల్లాల, గురజాల శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

● కట్టంగూరు మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి దేవాలయంలో, శ్రీకృష్ణనగర్‌లోని శివాంజనేయ లక్ష్మీనర్సింహస్వామి, పిట్టంపల్లి, ఈదులూరు, అయిటిపాముల, మాణిక్యాలమ్మగూడెంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

● కనగల్ మండలంలోని పొనుగోడు గ్రామ జక్కన్నగుట్ట పార్వతీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. బుడుమర్లపల్లి, దర్వేశిపురం, కనగల్, పగిడిమర్రి శివాలయాల్లో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

● కేతేపల్లి మండలంలోని ఇనుపాముల పచ్చల పార్వతీ సోమేశ్వరాలయం, కేతేపల్లి శంభులింగేశ్వరస్వామి, గుడివాడ రాజరాజేశ్వరి దేవాలయం, తుంగతుర్తి కాశీవిశ్వేరాలయాలతో పాటు పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

● మునుగోడులోని శివరామక్షేత్రంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

● మర్రిగూడ మండలంలోని మర్రిగూడ, ఇందుర్తి మేటిచందాపురం గ్రామాల్లో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మర్రిగూడలోని రామలింగేశ్వర స్వామికి ప్రతి సంవత్సరం రాజుపేట తండా పద్మశాలీ కాలనీలోని కమిటీ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌పై పట్టుచీరను నేస్తూ స్వామివారికి సమర్పించారు.



నల్లగొండ : పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో బారులుదీరిన భక్తులు


తిప్పర్తి: రామలింగాలగూడెంలో అభిషేకం చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


ఛాయా సోమేశ్వరాలంయలో అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

భీమానాయక్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి బంజారా సేవాసంఘం దేవరకొండ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు దివంగత భీమానాయక్ కృషి చేశాడని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం భీమానాయక్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బంజారా భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేవరకొండ ప్రాంతంలో గిరిజనులకు తాగు, సాగునీరు, రిజర్వేషన్ల అమలుకై భీమానాయక్ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. భీమానాయక్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, వడ్త్య దేవేందర్‌నాయక్, బిక్కునాయక్, లక్‌పతినాయక్, పాపనాయక్, నారాయణనాయక్, గోపాల్‌సింగ్, రమావత్ తుల్సానాయక్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మిర్యాలగూడకు సినీనటుడు సుమన్ రాక

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ శుక్రవారం మిర్యాలగూడకు రానున్నట్లు సుమన్ ఇండియా షోటోఖాన్ కరాటే అకాడమీ చీఫ్ బూడిద సైదులు, కరాటే మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్ తెలిపారు. అకాడమీ ఆధ్వర్యం లో శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు సుమన్ బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ హాజరుకానున్నట్లు తెలిపారు.

వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి


వెంచర్ అసోసియేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తమకు ప్లాట్లను విక్రయించిన వ్యక్తి షాపు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మునుగోడు రోడ్డులోని సర్వే నెంబర్ 740, 742, 743లలో 2002 మొత్తం 14.39 ఎకరాల్లో వెంచర్ చేయగా 2500 మందికి పైగా ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 150 మంది ఒకే దఫాలో డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోగా మిగతావారు వాయిదాల పద్ధతిలో చెల్లించినట్లు తెలిపారు. అయితే దేవదాయ శాఖ అధికారులు ఈ భూమి బ్రహ్మంగారి దేవాలయానికి సంబంధించినదని బోర్డు ఏర్పాటు చేసి ఇళ్లు కట్టుకోవడానికి నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా నేటి వరకు 24 సంవత్సరాలు గడుస్తున్నా మా భూమిలోకి మేము పోలేకపోతున్నామని తెలిపారు. వెంచర్ అమ్మిన యజమానులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో మధ్య తరగతి కుటుంబీకులమైన తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తాము ఎన్నిసార్లు యజమానిని అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ కోర్టులో ఉందని సమాధానం చెబుతూ దాటవేస్తున్నారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులు పెద్దులు, నర్సింహయాదవ్, నర్సింహ, ఈల లింగయ్య, కృష్ణమాచారి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎత్తిపోతలను ప్రభుత్వమే నిర్వహించాలి

వేములపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాల్వపై ఉన్న ఎత్తిపోతలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని లిఫ్ట్ రైతు సంఘాల అధ్యక్షుడు పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. సాగర్ ఎడమకాల్వపై గల పలు ఎత్తిపోతలను బుధవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పదేళ్ల క్రితం సాగర్ కాల్వల ఆధునీకరణ సమయంలో ఎత్తిపోతలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండా కేవలం పైపులైన్లు, యంత్రాలకు సంబంధించిన పనులను మాత్రమే చేశారన్నారు. దీంతో కాల్వలు, షట్టర్ల మరమ్మతులకు నోచుకోక చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేక ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు ఎత్తిపోతల నిర్వహణకు అవసరమైన ఎస్టిమేట్లను తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని లేనిచో ఎత్తిపోతల రైతాంగం ఐబీ సీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం సాగర్ ఎడమకాల్వపై గల ఎత్తిపోతలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, రైతులు, వినోద్, భిక్షం, రేనయ్య, పిచ్చిరెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

● ప్రాచీన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దైవచింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో స్వయంభూ శాంభవి శంభులింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 800 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ప్రాచీన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ప్రాచీన దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంతకుముందు ఆలయధర్మకర్తలు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నూక కిరణ్‌కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, మాజీ జడ్పీటీసీ యర్ర రనీలయాదగిరి, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, నాయకులు పర్రెపాటి యుగందర్, చింత ధనుంజయ్, వడ్లకొండ పరమేష్, బొమ్మగాని రవి, ఇంతియాజ్ అహ్మద్, జనార్ధన్, అవిలయ్య, పూజారులు పాల్గొన్నారు.


చిత్తలూరులో పూజల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు కిరణ్‌కుమార్‌రెడ్డి, సామేలు

రహదారి చల్లగా..హాయిగా..

● ఎండాకాలంలో నీడనిస్తున్న 'హరితహారం చెట్లు'

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వేసవి ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. మిట్ట మధ్యాహ్నం రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనచోదకులు చెమటోడ్చుతున్నారు. వాహనాలపై ప్రయాణిస్తూ ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు నీడ దొరికిన చోటల్లా ఆపుతున్నారు. జాతీయ రహదారి విస్తరణతో భారీ వృక్షాలు మటుమాయమయ్యాయి. దీంతో నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్ వరకు రహదారికి ఇరుపక్కన భారీ వృక్షాలు కొన్ని చోట్ల మాత్రమే ఉన్నాయి. దీంతో వేడిమి నుంచి కొంత ఉపశమనం పొందాలంటే అయితే హోటళ్ల లేదా అక్కడక్కడ కనిపించే వృక్షాల వద్ద వాహనచోదకులు ఆపుకుని సేద తీరుతున్నారు. నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్ దారిలో మునుగోడు ఫ్లైఓవర్ మూలమలుపు సర్వీస్ రోడ్డు వెంట ఏపుగా పెరిగన చెట్లు వాహన చోదకులకు ఎండ నుంచి ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. గత ప్రభుత్వంలో చేపట్టిన హరితహారం కార్యక్రమం కింద సర్వీస్ రోడ్డు వెంబడి నాటిన మొక్కలు నేడు వృక్షాలై చల్లటి నీడనిస్తున్నాయి.


జాతీయరహదారి సర్వీస్ రోడ్డులో నార్కట్‌పల్లి వద్ద నీడనిస్తున్న చెట్లు

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

శాలిగౌరారం, మర్రిగూడ, కేతేపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వరంగల్ - ఖమ్మం - నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గానికి గురువారం జరగనున్న ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శాలిగౌరారం జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసి ఒక పోలింగ్‌బూత్‌లో 65 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పోలింగ్ అధికారి ఎర్రంశెట్టి శ్రీనివాస్ తెలిపారు. మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల్లో 67మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సెక్టోరియల్ అధికారి, మర్రిగూడ తహసీల్దార్ బక్క శ్రీనివాస్ తెలిపారు. జడ్పీ హైస్కూల్‌లో 179 పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కేతేపల్లి జడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రానికి చేరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 53 మంది మండల కేంద్రం కేతేపల్లిలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 174 నెంబరు పోలింగ్ బూత్‌లో గురువారం జరిగే పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు అధికారులు బ్యాలెట్ బాక్సులను తీసుకురాగా వాటిని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో కేతేపల్లి తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, శాలిగౌరారం ఎస్ఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.




కేతేపల్లిలో పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరిన సిబ్బంది

క్రీడా స్ఫూర్తితో మెలగాలి : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో శ్రీదున్న ఇద్దాసు జాతర సందర్భంగా గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందచేసి మాట్లాడారు. క్రీడల వల్ల యువతలో ఐక్యతను పెంచుతాయన్నారు. ప్రతి ఏటా జాతరను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుంకిరెడ్డి పద్మావతి, నడ్డి లింగయ్యయాదవ్, నాయకులు షేక్ అబ్బాస్, సత్యనారాయణ, వికారాబాద్ సీఐ ఆంజనేయులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 । కనిష్ఠం 20.0

- భక్తి శ్రద్ధలతో మహా శివరాత్రి
- కమనీయంగా శివపార్వతుల కల్యాణోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు



పచ్చల సోమేశ్వరుడు, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

శివనామ స్మరణతో జిల్లా మార్మోగింది. మహా శివరాత్రి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలతో అంతటా అధ్యాత్మికత వెల్లివిరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలిరావడంతో కిక్కిరిశాయి. నల్లగొండ పట్టణంలోని ఛాయా సోమేశ్వరాలయం, పచ్చలకట్ట సోమేశ్వరాలయం, వాడపల్లి శివాలయాలు, ఏలేశ్వరంకొండ శివాలయాల్లో శివరాత్రి ప్రత్యేక పూజలు కొనసాగాయి. లింగోద్భవ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి వేళ ఆలయాల్లో శివకల్యాణాన్ని తిలకించారు. భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించి జాగరణ చేశారు. ఛాయా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. పూజల అనంతరం ఆమెకు అర్చకులు ఆశీర్వచనం అందజేశారు.



ఛాయా సోమేశ్వరాలయంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఆర్టీసీ.. ఆధునికం

టిమ్ వినియోగంలో కొత్త పద్ధతి



ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంలో ఆర్టీసీ ముందడుగు వేస్తోంది. టిమ్ (టికెట్ ఇష్యూయింగ్ మిషన్) వినియోగంలో కొత్త పద్ధతిని అనుసరించనుంది. చిల్లర సమస్యకు చెక్ పెట్టడంతో పాటు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. అంతేగాక ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించేందుకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే టీఎస్‌ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రయోగాత్మకంగా ప్రారంభించి విజయవంతంగా పర్యావరణహిత ఇంధనంతో నడిచే ఆధునిక బస్సుల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనుంది. ఉమ్మడి జిల్లాకు 132ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. బస్సులు విద్యుత్ సామర్థ్యంతోనే నడవనుండగా ఆ యాడిపోల్లో గతేడాది చివర చార్జింగ్ పాయింట్ల పనులు ఆరంభించారు. అయితే పనులు పూర్తయ్యేందుకు ఐదు నుంచి ఏడు నెలల సమయం పట్టనున్నట్లు సమాచారం.

- (ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)

నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాని కి గురువారం నిర్వహించే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉపాధ్యాయ వర్గాలు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకం గా తీసుకోవడం, బలమైన అభ్యర్థులు బరిలో ఉండడంతో పోలింగ్‌పై అందరి దృష్టి నెలకొంది. బుధవారం నియోజకవర్గ పరిధిలోని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రి, సిబ్బంది, భద్రతా సిబ్బందిని ప్రత్యేక బస్సుల ద్వారా పోలిం గ్ స్టేషన్లకు తరలించారు. బుధవారం సాయంత్రానికే అందరూ వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు.నియోజకవర్గంలో మొత్తం 25,797 మంది ఓటర్లు ఉండగా 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో 8,331 మంది ఓటర్లకు 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్

టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ నేడే

- పోలింగ్ కేంద్రాలకు చేరిన బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది
- 8,331 మంది ఓటర్లు
- బరిలో 19 మంది అభ్యర్థులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 77 పోలింగ్ స్టేషన్లు

జిల్లా	రూట్లు	పోలింగ్ కేంద్రాలు	పోలింగ్ సిబ్బంది	పోలీస్ సిబ్బంది	ఓటర్లు
నల్లగొండ	13	37	250	518	4,683
సూర్యాపేట	7	23	139	300	2,664
యాదాద్రి	5	17	104	165	984
మొత్తం	25	77	443	983	8,331

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 77 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, మొత్తం 8,331 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నల్లగొండ జిల్లాలో 13 రూట్లు, సూర్యాపేట జిల్లాలో 8 రూట్లు, యాదాద్రి జిల్లాలో ఐదు రూట్లు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, మరో అదనపు పోలింగ్ అధికారి, మరో సహాయ పోలింగ్ అధికారి, ఒక మైక్రోఅబ్జర్వర్, మరో సెక్టోరియల్ అధికారి ఎన్నిక విధుల్లో పాల్గొనున్నారు. నల్లగొండ జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలకు, 250 మంది సిబ్బంది, సూర్యాపేట జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలకు 139 మంది, యాదాద్రి జిల్లాలో 17 పోలింగ్ స్టేషన్లకు 104 మంది మొత్తం 443 మంది సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 518 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. నలుగురు డీఎస్పీలు, 18మంది సీఐలు, 43 మంది ఎస్‌ఐలు, 101 మంది ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, 278 మంది కానిస్టేబుళ్లు, మరో 74 మంది హోంగార్డులు ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తారు.

అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న 19 మంది అభ్యర్థులు

శాసనమండలి పునరుద్ధరణ తర్వాత 2007లో తొలిసారి ఎన్నికలు జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గంలో తొలిసారి స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త చుక్కా రామయ్య గెలుపొందారు. 2013లో జరిగిన ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘం బలపరచిన పూల రవీందర్ గెలుపొందగా, 2019లో యూటీఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అందులో సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి యూటీఎఫ్ మద్దతుతో బరిలో నిలిచారు. పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో ...

- మిగతా 6వ పేజీలో...

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో గురువారం నిర్వహించే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం. మిగిలిన 11 జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటున్నాం. బుధవారం సాయంత్రానికే అన్ని పోలింగ్ స్టేషన్లకు సిబ్బంది, భద్రతా బలగాలు పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. పోలింగ్ పూర్తయ్యాక తిరిగి గురువారం సాయంత్రమే అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి నల్లగొండలోని స్టేట్‌వేర్‌హౌస్ గోదాముల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు పోలింగ్ బాక్సులు తరలించేలా ఏర్పాట్లు చేశాం. ప్రతీ పోలింగ్‌స్టేషన్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సెక్టోరియల్ అధికారిని నియమించాం. ఎన్నికకు సంబంధించి ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులంతా వారి ఓటుహక్కును వినియోగించుకోవాలి. ఎన్నిక ప్రశాంతంగా ముగిసేందుకు అందరూ సహకరించాలి.

- ఇలా త్రిపాఠి, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్

50శాతం రాయితీతో స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణ

సెట్విన్ కోఆర్డినేటర్ సరిత

నల్లగొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని సెట్విన్ సాంకేతిక శిక్షణా సంస్థలో విద్యార్థులకు 50శాతం ఫీజు రాయితీతో పలు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సెట్విన్ కోఆర్డినేటర్ ఎం.సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు పూర్తయ్యాక జాబ్‌మేళా కూడా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మొత్తం ఐదు విభాగాల్లో 26 రకాల కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఐదు రకాల కంప్యూటర్ కోర్సులు, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఐదు కోర్సులు, బ్యూటీషియన్‌లో ఐదు రకాల కోర్సులు, ఎడ్యుకేషన్‌లో రెండు కోర్సులు, తొమ్మిది రకాల సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన, ఉపాధి అందించే కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు నల్లగొండలోని సెట్విన్ శిక్షణా కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి ●6లో..

నీటితొట్ల నిర్వహణపై పట్టింపేదీ? ●7లో..

బలంగా బహుజనవాదం : ఇంటలెక్చువల్ ఫోరమ్

పూల రవీందర్‌కు బహుజనుల మద్దతు అని విశ్వాసం



సూర్యాపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

నల్లగొండ, ఫిబ్రవరి 26: ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మునుపెన్నడూ లేని విధంగా బహుజనవాదం గెలుస్తుందని బహుజన మేధావులు విశ్వసిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో గతానికి భిన్నంగా ప్రచారంలో ఈ వాదం పనిచేసిందని అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు తదితరులు ఈ ఎన్నికల్లో బీసీ, బహుజన వాదాన్ని బలంగా ప్రచారం చేయడంతో ఈ సానుకూలత వచ్చిందని భావిస్తున్నారు. బీసీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపు ద్వారా రాష్ట్ర రాజకీయాలు మలుపు తిరుగుతాయని, ఇది బీసీ రాజ్యాధికార వాదానికి దోహదపడుతుందని చెబుతున్నారు. 35 పైగా ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్య సంఘాల మద్దతుతో బహుజన అభ్యర్థిగా రంగంలో ఉన్న పూల రవీందర్ గెలుపునకు ఈ నినాదం దోహదపడుతుందని చెప్పారు.

విద్యారంగంలో రవీందర్ ప్రస్థానం

పూల రవీందర్ సాధారణ ఉపాధ్యాయుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ ఉద్యమంలో టీటీజేఏసీ చైర్మన్‌గా, ఆరేళ్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. ఈ కాలంలో ఉపాధ్యాయుల పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన విషయాన్ని బలంగా తీసుకెళ్లగలిగామని బీసీ నేతలు శీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘంలోని వర్గ విభేదాలతో ఓటమిపాలైనా, గడిచిన ఆరేళ్లు రవీందర్ ఆ సంఘంలోనే ఉంటూ ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వచ్చారన్నారు. 010 ద్వారా ఉపాధ్యాయులకు వేతనాలు, మహిళా ఉపాధ్యాయులను చైల్డ్‌కేర్ సెలవులు, పండిట్, పీఈటీ అప్ గ్రేడేషన్, కేజీబీవీ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం, వివిధ పీఆర్సీ కాలాల్లో మెరుగైన ఫిట్‌మెంట్ సాధన, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల, గురుకులాల సిబ్బందికి ఉపయుక్తమైన ఎన్నో జీవోల వెనక రవీందర్ కృషి ఉందనేది ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్), యూనిఫైడ్ పెన్షన్ సిస్టమ్(యూపీఎస్)ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించడానికి కృషి చేస్తారని, పీఆర్సీలో ఉద్యోగ ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తారన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్స్ ఉపాధ్యాయుల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలను సందర్శించి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థిస్తుంటే బహుజన బిడ్డగా పుట్టినందుకు, పోటీ చేస్తున్నందుకు తాను గర్వపడుతున్నానని పూల రవీందర్ పేర్కొంటున్నారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తనను ఆదరిస్తారని ఆయన ఆశిస్తున్నారు.

లక్షలు పోయాయ్.. అప్పులు మిగిలాయ్

- రిజర్వేషన్లు తేలకముందే గ్రామాల్లో ఆశావహుల ప్రయత్నాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు విచ్చలవిడిగా ఖర్చు
- అప్పులు చేసి ఖర్చు చేసిన వైనం?
- స్థానిక సంస్థల ఎన్నికల ఆలస్యంతో మనోవేదన ●6లో..

బోనస్ కోసం ఎదురుచూపు

- జిల్లాలో 74,394 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు
- రూ. 10 కోట్ల మేర బకాయి ●8లో..

బియ్యం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్టు

చింతపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా కేసులో డీలర్ల పాత్ర ఉంటే వారిపై పీడీ యాక్టు కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ హెచ్చరించారు. చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆరు నెలల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసిన వ్యక్తుల గురించి ఆరా తీశారు. డీలర్లు వినియోగదారులకు రేషన్‌బియ్యం సక్రమంగా అందించాలని, లేనిచో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

2 నుంచి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

డిండి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని దాసరినెమలిపూర్ గ్రామంలో గల లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను మార్చి 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గొంగిడి వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న పద్మావతి శ్రీనివాసుల కల్యాణం, అన్నదానం, 5న సామూహిక వ్రతాలు, 6న తెల్లవారుజామున రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

క్రీడా స్ఫూర్తితో మెలగాలి : ఎమ్మెల్సీ కోటిరెడ్డి



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

పెద్దవూర, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో దున్న ఇద్దాసు జాతర సందర్భంగా గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందచేసి మాట్లాడారు. క్రీడల వల్ల యువతలో ఐక్యతను పెంచుతాయని అన్నారు. దున్న ఇద్దాసును స్మరించుకుంటూ ప్రతి ఏటా జాతరను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుంకిరెడ్డి పద్మావతి, నడ్డి లింగయ్యయాదవ్, నాయకులు షేక్ అబ్బాస్, సత్యనారాయణ, వికారాబాద్ సీఐ అర్కెపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల సామాగ్రితో సిబ్బంది

దేవరకొండ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నేడు జరగనున్న ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో రమణారెడ్డి బుధవారం తెలిపారు. దేవరకొండ డివిజన్ పరిధిలో నేరేడుగొమ్ము మోడల్‌స్కూల్‌లో, డిండి, చందంపేట, చింతపల్లి, గుడిపల్లి, పీఏపల్లి, కొండమల్లేపల్లి, గుర్రంపోడు మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. డివిజన్‌లో 556 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

● కొండమల్లేపల్లి :మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 193వ పోలింగ్ బూత్‌లో ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ అన్వర్ హుస్సేన్ తెలిపారు. బుధవారం పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ పోలింగ్ బూత్ పరిధిలో 84 మంది ఉపాధ్యాయ ఓట్లు ఉన్నట్లు తెలిపారు. తహసీల్దార్ వెంట పోలింగ్ పీవో సంపత్, ఏపీవో ఫరీద్, ఓపీవో వీరేష్, ఆర్ఐ శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

భీమానాయక్ ఆశయ సాధనకు కృషి చేయాలి



భీమానాయక్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి):గిరిజనుల సమస్యల పరిష్కారానికి బంజారా సేవాసంఘం దేవరకొండ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు దివంగత భీమానాయక్ కృషి చేశాడని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం భీమానాయక్ 8వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బంజారాభవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేవరకొండ ప్రాంతంలో గిరిజనులకు తాగు, సాగునీరు, రిజర్వేషన్ల అమలుకై భీమానాయక్ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. భీమానాయక్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, వడ్త్య దేవేందర్‌నాయక్, బిక్కునాయక్, లక్‌పతినాయక్, పాపనాయక్, నారాయణనాయక్, గోపాల్‌సింగ్, రమావత్ తుల్సానాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.

ఎత్తిపోతలను ప్రభుత్వమే నిర్వహించాలి



వేములపల్లి: ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న పాదూరి శశిధర్‌రెడ్డి

వేములపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాల్వపై ఉన్న ఎత్తిపోతలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని లిఫ్ట్ రైతు సంఘాల అధ్యక్షుడు పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. సాగర్ ఎడమకాల్వపై గల పలు ఎత్తిపోతలను బుధవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పదేళ్ల క్రితం సాగర్ కాల్వల ఆధునీకరణ సమయంలో ఎత్తిపోతలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండా కేవలం పైపులైన్లు, యంత్రాలకు సంబంధించిన పనులను మాత్రమే చేశారన్నారు. కాల్వలకు సంబంధించిన పూడిక పనులు, తూములు, షట్టర్ల నిర్మాణాలు కాల్వలపై రహదారులను మరమ్మతులు చేయకుండా వదిలివేశారని ఆయన అన్నారు. దీంతో కాల్వలు, షట్టర్ల మరమ్మతులకు నోచుకోక చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేక ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎత్తిపోతలపై పనిచేసే ఆపరేటర్లు, లస్కర్లు, వాచ్‌మెన్లకు జీతాలు రైతులే తలా ఇంత వేసుకొని ఇవ్వాల్సి రావడంతో లిఫ్టుల నిర్వహణ రైతులకు భారంగా మారిందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు ఎత్తిపోతల నిర్వహణకు అవసరమైన ఎస్టిమేట్లను తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని లేనిపక్షంలో ఎత్తిపోతల రైతాంగం ఐబీ సీఈ కార్యాలయ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రభుత్వం సాగర్ ఎడమకాల్వపై గల ఎత్తిపోతలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, రైతులు, వినోద్, భిక్షం, రేనయ్య, పిచ్చిరెడ్డి, నాగయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

1న జిల్లాకు రానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సీపీఎం నూతన రాష్ట్ర కార్యదర్శి జాన్‌వేస్లీ మార్చి 1వ తేదీన నల్లగొండకు రానున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ బైపాస్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ద్విచక్రవాహన ర్యాలీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు, ఇతర సీపీఎం కమిటీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని పేర్కొన్నారు. మిర్యాలగూడ రోడ్డులోని కోటిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జాతీయ మహాసభల ముసాయిదా తీర్మానం, రాజకీయ తీర్మానాలపై చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బోనస్ కోసం ఎదురుచూపు

● జిల్లాలో 74,394 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు ● రూ. 10 కోట్ల మేర బకాయి



హాలియాలో సన్నధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , తదితరుల (ఫైల్)

హాలియా, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నధాన్యం పండించిన రైతులకు రూ. 500 ప్రకటించడంతో రైతులు సన్నధాన్యం సాగుకు మొగ్గు చూపారు. అయితే మార్కెట్‌లో జేఎస్ఆర్, చింట్లు, పూజాగోల్డ్, హెచ్ఎంటీలు సాగు చేసిన రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకున్నారు. అయితే బీపీటీ, మహీంద్రాచిట్లు రకం సన్నధాన్యం సాగు చేసిన రైతులకు ప్రభుత్వం అందించిన బోనస్ రైతులకు మరింత గిట్టుబాటు ధర అందేందుకు దోహదపడింది. నల్లగొండ జిల్లాలో ప్రభుత్వం 74,394 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని 15,879 మంది రైతుల నుంచి పీఏసీఎస్, ఐకేపీ, ఎఫ్‌పీవో కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసింది. సన్నధాన్యం కొనుగోలు చేసిన మొత్తం రూ.172.59 కోట్లు కాగా ఇంకా రైతులకు 10 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మి రెండు నెలలు అవుతున్నా రూ. 500 ఇంకా పడలేదని బోనస్ డబ్బులు కోసం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను రైతులు ఆరా తీస్తున్నారు సన్నధాన్యం కొనుగోలు చేసిన రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2,320 చొప్పున వెంటనే వారి ఖాతాల్లోకి జమ చేశారు. వారం తర్వాత బోనస్ రూపాయలు కూడా రైతన్న ఖాతాలోకి నేరుగా జమ చేశారు. మిగిలిన బకాయిలు కూడా జమ చేస్తే రైతన్న పెట్టుబడులకు ఉపయోగకరంగా ఉంటుందని వారి అభిప్రాయం వ్యక్త పరుస్తున్నారు.

రెండు నెలలు అవుతున్నా జమ కాలేదు



సన్నధాన్యం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించి రెండు నెలలు అవుతున్నా రూ.500 బోనస్ ఖాతాలో పడలేదు. డబ్బుల కోసం ఇబ్బందులు పడుతున్నామని తొందరగా వస్తే పొలం పెట్టుబడికి ఉపయోగపడుతుంది.

- దండా కొండల్, రాజవరం, తిరుమలగిరి(సాగర్)

మిగిలిన బకాయిలు నేరుగా జమ చేస్తాం



15,879 మంది రైతుల నుంచి సన్నధాన్యాన్ని 172 కోట్ల మేరకు కొనుగోలు చేశామని చివరగా విక్రయించిన రైతు ఖాతాల్లో 10 కోట్ల మేరకు ఇంకా జమ చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని త్వరలోనే వారి ఖాతాల్లోకి నేరుగా బోనస్ సోమ్ము జమ కానున్నది.

హరీష్, డీఎం,నల్లగొండ

మాజీ ఎమ్మెల్యే ప్రార్థనలు

చింతపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీ.కే.మల్లేపల్లి హజరత్ అబ్బాస్ దర్గాలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సమీపిస్తున్నప్పటికి గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పరిష్కారం చూపకపోవడం బాధకరమన్నారు కార్యక్రమంలో దర్గా కమిటి నిర్వాహకులు ఎండీ చాంద్‌పాషా, చైర్మన్ కేవీ.రమేష్ రాజు, సభ్యులు ఎండి. సయ్యద్ పాషా పాల్గొన్నారు.

రేపు మిర్యాలగూడకు సినీనటుడు సుమన్ రాక

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ శుక్రవారం మిర్యాలగూడకు రానున్నట్లు సుమన్ ఇండియా షోటోఖాన్ కరాటే అకాడమీ చీఫ్ బూడిద సైదులు, కరాటే మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్ తెలిపారు. అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు సుమన్ బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్‌నాయక్ హాజరు కానున్నట్లు తెలిపారు.

హరహర మహాదేవ శంభోశంకర

● భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు ● కిటకిటలాడిన ఆలయాలు ● పలు చోట్ల అన్నదానం



దామరచర్ల : వాడపల్లిలో ..

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : హరహర మహదేవ..శంభో శంకర... అంటూ భక్తులు శివనామస్మరణతో శైవ క్షేత్రాలన్నీ మార్మోగాయి. చారిత్రాత్మక శివ క్షేత్రాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకొని అభిషేకాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు రావడంతో భక్తుల సందడి నెలకొంది. ఆలయాల నిర్వాహకులు భక్తులకు తగినట్టుగా ఏర్పాట్లను చేశారు. అడవిదేవులపల్లి మండల కేంద్రంలో పంచయాతన సోమేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూజలు చేశారు. దేవరకొండ పట్టణంలోని పాత శివాలయం, మార్కండేయస్వామి ఆలయం, దేవరకొండ ఖిల్లాలోని శివాలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పూజలు చేశారు. ముదిగొండ కమలాపూర్ వీరభద్రస్వామి ఆలయంలో శివరాత్రి, జాతర ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఖిల్లాలో దేవరకొండ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పురస్కరించుకొని పెరిణి నాట్యం, ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు పర్యాటకులను, భక్తులను ఆకట్టుకున్నాయి. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నందీశ్వర ఆలయంలో అభిషేకం చేశారు. చింతపల్లి మండలం గొడుకొండ్ల(వీ.టీ.నగర్)లోని శివాలయాల్లో శివునికి అభిషేకాలు జరిపారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. వేములపల్లి శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పబ్బతి కరుణాకర్ ఆయన్ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ పండితుడు ఉగ్రదండి హరి ప్రసాద్‌శర్మ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందచేశారు. రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. నిడమనూరు మండలం వెంగన్నగూడెం, తుమ్మడం, నారమ్మగూడెం, నిడమనూరు తదితర గ్రామాల్లో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి వెంగన్నగూడెం శివాలయంలో పూజలు చేశారు. చందంపేట మండలం దేవరచర్ల మునీశ్వర ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ట్రస్టు సభ్యులు హేమ్లానాయక్ ఆధ్వర్యంలో తాగునీరు, ఉచిత అన్నదానం చేపట్టారు. ఈ ఆలయానికి మహబూబ్‌నగర్, గుంటూరు, మాచర్ల, హైదరాబాద్, మిర్యాల గూడ, నాగర్‌కర్నూల్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని శివాలయం, ఉమామహేశ్వరాలయాలతో పరిసర ప్రాంత శివాలయాలకు భక్తులు పోటెత్తారు. దామరచర్ల మండలం వాడపల్లిలోని మీనాక్షి అగస్త్యేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. దామరచర్ల మండల కేంద్రంలోని త్రిలింగేశ్వరాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. తిరుమలగిరి (సాగర్) మండలంలోని రాజవరం గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో స్వయంభూగా వెలసిన మల్లప్పయ దేవాలయానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. మండలంలోని రంగుండ్ల తండాలోని భగుడు శివాలయం వద్ద ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి పూజలు చేశారు. అనుముల మండలం పేరూరు గ్రామం లోని స్వయంభూ సోమేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పేరూరు శివాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు.



మిర్యాలగూడ : శివాలయంలో పోటెత్తిన భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన ఏలేశ్వరం

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న ఏలేశ్వరం కొండ బుధవారం శివనామస్మరణతో మార్మోగింది. ప్రతి ఏటా మహాశివరాత్రి రోజు తెలంగాణలోని భక్తులే కాకుండా ఏపీ రాష్ట్రంలోని భక్తులు కూడ భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. దీంతో పర్యాటక శాఖ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏలేశ్వరం కొండకు లాంచీ ట్రిప్పులను నడిపింది. ఏలేశ్వరం కొండపై భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగార్జునసాగర్, దేవరకొండ పోలీసులు బందోబస్తును నిర్వహించారు.



ఏలేశ్వరం కొండపై బారులుదీరిన భక్తులు



వేములపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు




నిడమనూరు : వెంగన్నగూడెంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి




కొండమల్లేపల్లి సీతారామ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

చిత్రం భళా..

» చిత్రలేఖనంలో రాణిస్తున్న బ్రహ్మాచారి » మనిషిని ఇట్టే గీయగల నైపుణ్యం





నాగార్జునసాగర్,(ఆంధ్రజ్యోతి): ఒక్కో మనిషికి ఒక్కో కళ ఉంటుంది. తమలో ఉన్న ప్రతిభను బయటపెట్టడానికి సమయం కోసం ఎదురుచూస్తుంటారు కొందరు. అలాంటి కోవకు చెందిన వాడే నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రానికి చెందిన ఓరోజు బ్రహ్మాచారి. పెద్దవూరకు చెందిన నర్సింహాచారి-కమలమ్మ దంపతులకు నలుగురు కుమారులు. అందులో చిన్నవాడు బ్రహ్మాచారి. చిన్నప్పటి నుంచే చిత్రకళపై ఆసక్తి ఉండేది. కానీ తల్లి దండ్రులకు శిక్షణను ఇప్పించే స్థోమత లేకబ్రహ్మాచారిని ఎక్కడికి పంపించలేక పోయారు. దాంతో ప్రతి రోజు సాయంత్రం పాఠశాల నుంచి రాగానే తెల కాగితంపై పెన్సిల్‌తో చిత్రాలు గీస్తూ తనకు చిత్రకళపై ఉన్న మక్కువను మెరుగు పరుచుకున్నాడు. ఈ క్రమంలో డిగ్రీ పూర్తి కాగానే 2008 లోనే హైదరాబాద్‌లో మ్యాట్రిక్స్ ఫార్మాసూటికల్స్ కంపెనీలో క్వాలిటీ విభాగంలో ఉద్యోగం సాధించాడు. ఓ వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే సాయంత్రం గౌతమ బుద్ధుడు, బ్రహ్మ. రాముడు, కృష్ణుడు, జీసెస్ వంటి దేవుళ్ల ఫొటోలతో పాటు తన స్నేహితుల ఫొటోలు, కుటుంబ సభ్యుల ఫొటోలు పెన్సిల్‌తో ఉన్నట్టుగాఇట్టే గీయగలడు. బ్రహ్మం పెన్సిల్ పట్టిందంటే అర గంటలో బొమ్మ గీస్తాడు. తన స్నేహితుల వివాహాలకు వెళ్లినప్పుడు వధూవరుల ఫొటో లు పెన్సిల్‌తో గీసీ బహు మతిగా ఇస్తున్నాడు.


అంతర్జాతీయ స్థాయిలో పేరుతెచ్చుకోవడమే లక్ష్యం



పెన్సిల్ చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవడమే నా లక్ష్యం. ఎప్పటికైనా అంతర్జాతీయ స్థాయిలో పెన్సిల్ చిత్రాల ప్రదర్శనను ఏర్పాటు చేస్తా.

- బ్రహ్మాచారి, పెన్సిల్ చిత్రకారుడు

ప్రమాదకరంగా సీసీ రోడ్డు



ప్రమాదకరంగా పోలేపల్లి సీసీ రహదారి

చింతపల్లి మండలం పోలేపల్లిరాంనగర్ నుంచి ఉమ్మాపురం, తక్కళ్లపల్లి, తదితర గ్రామా లకు నిత్యం ద్విచక్రవాహనదారులు వెళ్తుంటారు. గ్రామశివారులో 8 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ రహదారి పక్కనే మురుగు కాల్వ నిర్మాణం చేపట్టారు. ఈ రహదారి గుండా అధిక లోడ్‌తో లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగుతున్నాయి. దీంతో రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ్లలో వాహనదారులు ఈ రహదారి గుండా వెళ్తూ ప్రమా దాల బారిన పడుతున్నారు. అధికారుల గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కారించాలనిప్రజలుకోరుతున్నారు. - చింతపల్లి,(ఆంధ్రజ్యోతి)

మతసామరస్యానికి ప్రతీక మదార్ సాహెబ్ దర్గా

చింతపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల రిజర్వాయర్ ఎదురుగా నెలకొన్న హజరత్ జిందేషా మదార్ సాహెబ్ దర్గాలో బుధవారం ఉర్సు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ భక్తులు కోరిన కోర్కెలు నేరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. కమిటి సభ్యులు ఆయన్ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కేతావత్ బిల్యానాయక్, మాజీ సర్పంచి కొండూరి శ్రీదేవి శ్రీనివాస్, బాదేపల్లి పులిరాజ్ గౌడ్, నిరంజన్ గౌడ్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.